క్లుప్తంగా

ఉత్తమమైన గ్రంథం భగవద్గీత


భగవద్గీత శ్లోకాలు నేర్పుతున్న స్వామిజీ

శ్రీకాకుళం కల్చరల్: మానవ మనుగడకు ఎంతో ఉత్తమమైన గ్రంథం భగవద్గీత అని చిన్మయమిషన్ నిర్వాహకులు పరాత్మానంద సరస్వతి స్వామి అన్నారు. బలగలోని హరే రామ మందిరంలో ఆదివారం భగవద్గీత ఐదో అధ్యాయం కర్మసన్యాస యోగం శ్లోకాలను చిన్నారులకు పఠనం చేయించారు. ఈ కార్యక్రమం ప్రతి ఆదివారం నిర్వహిస్తున్నామని ఎవరైనా తమ పిల్లలను ఇక్కడి పంపవచ్చని చిన్మయా మిషన్ ప్రతినిధి కూనపులి వెంకటేశ్వరులు తెలిపారు.

ఆలయంలో తిరుప్పావై ప్రవచనాలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయంలో ఆదివారం ఉదయం తిరుప్పావై ప్రవచనాలను పద్మనాభాచార్యులు వినిపించారు. తిరుప్పావై పాశురాల ద్వారా గోదాదేవి స్వామి ఆరాధించిన తీరుని అర్థవంతంగా తెలియజేశారు. ఆలయ అర్చకులు శేషాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిభావం పెంపొందించాలి


మాట్లాడుతున్న లింగరాజు

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి మందిరాల్లోని జిల్లా అధ్యయన కేంద్రం ద్వారా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా భక్తి భావం పొంపొందించాలని జిల్లా అధ్యక్షుడు వై.లింగరాజు అన్నారు. స్థానిక బ్యాంకర్స్ కాలనీ మందిరంలో జిల్లా అధ్యయన కేంద్రం సమావేశం ఆదివారం జరిగింది. జిల్లా ఇన్‌చార్జి వూన్న లక్ష్మణమూర్తి, టి.ఎస్.ఎస్.మూర్తి, బోయిన నర్సింహమూర్తి, అంపోలు లక్ష్మణరావు, కిల్లాన ఫాల్గుణరావు, అనాది గుప్త, భానుమూర్తి పాల్గొన్నారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న లక్ష గృహ నామ సంకీర్తన కార్యక్రమంలో భాగంగా అరసవల్లిలోని కిల్లాన ఫాల్గుణరావు ఇంటి వద్ద నామ సంకీర్తన, భజన కార్యక్రమం జరిగింది.

గ్రామాల్లో ప్రత్యేక నిఘా

జి.సిగడాం: సంక్రాంతికి ఎవరైనా కోడి పందేలు వేసినా, జూదం ఆడినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని రణస్థలం సీఐ రామచంద్రరావు హెచ్చరించారు. మండలంలోని సంతవురిటి, పాలఖండ్యాం, జి.సిగడాం గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. పండగ నేపథ్యంలో గ్రామాల్లో అపరిచితులు సంచరిస్తే అటువంటి వారిని గుర్తించి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. చిన్న, చిన్న సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించుకోవాలని, కోర్టుల చుట్టూ తిరిగి కాలాన్ని వృథా చేసుకోవద్దన్నారు. ఇప్పటికే పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులను త్వరితగతిన పరిష్కరించే దిశగా పనిచేస్తామన్నారు. స్థానిక ఎస్‌ఐ సామంతుల రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

వివాదాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎస్‌ఐ సత్యనారాయణ

ఎచ్చెర్ల క్యాంపస్: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని ఎచ్చెర్ల ఎస్సై వి.సత్యనారాయణ అన్నారు. ముద్దాడ గ్రామంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై ఆదివారం అవగాహన కల్పించారు. ఓటర్లు తమకు నచ్చిన పార్టీకి ఓటు వేసుకోవాలని, వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో 107 బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

మిజోరాం గవర్నర్‌ను కలిసిన బీజేపీ నాయకులు


హరిబాబును సత్కరిస్తున్న వేణుగోపాలం తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబును జిల్లాకు చెందిన బీజేపీ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖపట్నంలోని ఆయన నివాసంలో పార్టీ రాష్ట్ర పదాధికారి, శ్రీకాకుళం అసెంబ్లీ కన్వీనర్ పైడి వేణుగోపాలం నేతృత్వంలో నాయకులు కలిసి పుష్పగుచ్ఛంతో సత్కరించారు. శ్రీకాకుళం జిల్లాలోని ప్రఖ్యాత ఆలయాలను కుటుంబంతో కలిసి దర్శించాలని గవర్నర్ కంభంపాటికి విజ్ఞప్తి చేశారు. గవర్నర్‌ను కలిసినవారిలో పూజారి చెల్లయ్య, పండి యోగేశ్వరరావు, సురేష్ సింగ్ ఉన్నారు.

- మూడు విడతలుగా రుణమాఫీ
- బకాయి రుణాలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ
- నాలుగో విడతకు రంగం సిద్ధం
- శ్రీకాకుళం రూరల్ మండలంలో 1887 సంఘాలకు లబ్ధి

ప్రగతి పర్వం


కల్లేపల్లిలో సమావేశమైన స్వయం శక్తి సంఘాల మహిళలు

అక్కచెల్లెమ్మలకు ఆసరా


బైరిలో స్వయం శక్తి సంఘాలు

ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రుణమాఫీ అమలు చేసి అండగా నిలిచారు. వైఎస్సార్ ఆసరా పేరిట శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలో 1887 స్వయంశక్తి సంఘాలకు మూడు విడతల్లో రుణమాఫీ చేయడంతో అక్కచెల్లెమ్మల్లో ఆనందం వ్యక్తమవుతోంది. స్వయం సహాయక బృందాల ఉత్పాదకను మెరుగుపరచడంతో పాటు గత ప్రభుత్వ హయాంలో బ్యాంకుల్లో బకాయి రుణాలను తిరిగి చెల్లించేందుకు వైఎస్సార్ ఆసరా పథకం దోహదపడుతోంది. దీనిలో భాగంగా పట్టణ, గ్రామీణా స్వయం సహాయక బృందాల మహిళలకు 2019లో ఎన్నికల నాటికి బ్యాంకుల్లో ఉన్న రుణాలను ప్రభుత్వం నాలుగు విడతల్లో చెల్లిస్తోంది. మండలంలోని అన్ని స్వయం సహాయ సంఘాలకు చెందిన ఖాతాల్లో ఈ సొమ్మును నేరుగా ప్రతీ ఏడాది జమ చేస్తోంది.

శ్రీకాకుళం రూరల్

మండలం	శ్రీకాకుళం రూరల్
పంచాయతీలు	28
గ్రామాలు	56
స్వయం సహాయక సంఘాలు	1887
సభ్యులు	20,322 మంది
ఒక్కో ఏడాదికి జమ	రూ.15,92,68,01,678
మొత్తం	రూ.47,76,05,034

రుణపడి ఉంటాం



నేను టైలరింగ్ చేస్తుంటాను. జగనన్న ఇచ్చిన మాట ప్రకారం మాకు మూడు విడతల్లో సంఘానికి నగదు జమ చేశారు. ఆ డబ్బుతో కుట్టుమిషన్, ఇతరత్రా మెటీరియల్‌ను కొనుక్కున్నా. జగనన్నకు రుణపడి ఉంటాం.

– ఎస్ రాజ్యలక్ష్మి, శ్రీ సిద్ధి వినాయక పొదుపు సంఘం, కుందువానిపేట

చేపల వ్యాపారం..



ఈ ప్రభుత్వంలో మాకు అంతా మంచే జరిగింది. డ్వాక్రా అప్పుల ఊబిలో ఉన్న మా సంఘానికి జగనన్న ప్రభుత్వం చేయూతనిచ్చింది. నాకు మూడు విడతల్లో అందిన నగదుతో చేపలు వ్యాపారం చేస్తున్నాం.

– జగదీశ్వరి, శ్రీరామస్వయంశక్తి సంఘం, కుందువానిపేట

త్వరలో నాలుగో విడత..



వైఎస్సార్ ఆసరాకు సంబంధించి నాలుగో విడతకు అంతా సిద్ధం చేశాం. మా పరిధిలోని 1887 స్వయం శక్తి సంఘాలకు మూడు విడతలు కలిపి రూ.47,67,05,034 ఇంతవరకూ నగదును అందించాం. నాలుగో విడత ప్రక్రియ జరుగుతోంది.

– వి.సుజాత, ఏపీఎం, శ్రీకాకుళం

నీరజకు కళాశిఖరోజ్వల పురస్కారం


పురస్కారాలతో నీరజ, సింధుశ్రీ

శ్రీకాకుళం కల్చరల్: చెన్నైకు చెందిన రంగ రామానుజ వికాయేసా కల్చరల్ కౌన్సిల్, సాయినాథ కళాసమితి, శ్రీసాంస్కృతిక వేదిక సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శ్రీకాకుళంలోని అభినయ నృత్య నికేతన్ గురువైన డాక్టర్ తిమ్మరాజు నీరజ సుబ్రహ్మణ్యంకు కళ శిఖరోజ్వల నృత్య పురస్కారంతో సత్కరించారు. చెన్నైలోని అన్నా నగర్ శ్రీసీతారామర్ తిరుమన్న మండపంలో ఈ నెల ఆరు, ఏడు తేదీల్లో మార్గలి నృత్య కదంభోత్సవం 2024 నిర్వహించారు. నీరజ కుమార్తె కె.సింధుశ్రీ హర్షితచే 40 నిమిషాల పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన అందరిని అలరించింది. ఆనంతరం కంచి కామకోటి పీఠం ఆస్థాన విద్యాన్‌ఎస్.సి. మాధవ్, నాట్యగురు డాక్టర్ అరుణ్‌సాయి కుమార్, రామ్‌కో సిమ్మెంట్స్ వైస్ ప్రెసిడెంట్ రమేష్ భారత్, చెన్నై సాంస్కృతిక వేదిక ప్రెసిడెంట్ విజయలక్ష్మీ, ఆంధ్రకళాస్రవంతి ప్రెసిడెంట్ జె.వి.ఎం.నాయుడు చేతుల మీదగా నీరజా సుబ్రహ్మణ్యంకు కళాశిఖరోజ్వల పురస్కారం, సింధుశ్రీ హర్షితకు మార్గలి కదంబ పురస్కారం అందించి సత్కరించారు.

ఉన్నత గ్రంథం 'వివేక చూడామణి'


సుబ్బారావును సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: ఎంతో ఉన్నతమైన గ్రంథం ఆది శంకరాచార్యులు రచించిన 'వివేక చుడామణి' అని విజయనగరం పట్టణానికి చెందిన వక్త, తెలుగు పండితులు రాళ్లపల్లి రామసుబ్బారావు అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో వివేక చూడామణి ప్రవచనాల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవజన్మకు గమ్యమైన కైవల్య సాధనకు ఈ గ్రంథం ఉపకరిస్తోందన్నారు. మందిరం అధ్యక్షుడు గుమ్మా నగేష్ మాట్లాడుతూ.. ఈ గ్రంథంలోని 581 శ్లోకాలను పూర్తి చేసేందుకు సహకరించిన వక్తలకు ధన్యవాదాలు తెలియజేశారు. ముందుగా వక్త సుబ్బారావును మందిరం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సనపల నారాయణ మూర్తి, పతంజలి శాస్త్రి, పైడి హరనాథరావు, కామేశ్వరరావు, నిష్టల నర్సింహమూర్తి, నాగేంద్రరావు, స్వామి, రామకృష్ణ, గోవిందరావు, నాగేశ్వరరావు, అనూరాధ, సరస్వతి, భారతి, బాబూరావు, ఈశ్వరరావు ఉన్నారు.

నారాయణ తిరుమలకు అయోధ్య రాముని అక్షింతలు


శ్రీకాకుళం కల్చరల్: బలగలో అక్షింతలు పంపిణీ చేస్తున్న దృశ్యం


ఎచ్చెర్ల క్యాంపస్: అక్షతలు పంపిణీకి సిద్ధమవుతున్న రామభక్తులు

శ్రీకాకుళం కల్చరల్: పీఎన్ కాలనీలోని నారాయణ తిరుమలకు అయోధ్య రామాలయం శ్రీరాముని అక్షింతలు ఆదివారం అందచేశారు. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసుకు అక్షింతలు అందచేయగా వాటిని అక్కడికి వచ్చిన భక్తులకు పంపిణీ చేశారు. అలాగే బలగ బుచ్చిపేటలో ఉన్న శ్రీరామమందిరం సభ్యుల ఆధ్వర్యంలో అక్షింతలు మందిరానికి వచ్చిన భక్తులకు, వారి ఇళ్లకు పంపిణీ చేశారు.

అయోధ్య రాముని అక్షతలు పంపిణీ

ఎచ్చెర్ల క్యాంపస్: సంతసీతారంపురం గ్రామంలో అయోధ్య రాముని అక్షతలను రామభక్తులు ఇంటింటికీ వెళ్లి ఆదివారం పంపిణీ చేశారు. గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శోభా యాత్ర నిర్వహించారు.


శ్రీకాకుళం రూరల్: అక్షింతలు పంపిణీ చేస్తున్న దృశ్యం

వప్పింగిలో..

శ్రీకాకుళం రూరల్: వప్పంగి గ్రామంలోని కోదండ రామ ఆలయ ధర్మకర్త గొండు కృష్ణమూర్తి దంపతుల ఆధ్వర్యంలో ఇంటింటికీ అయోధ్య రామ అక్షింతలను ఆదివారం పంచిపెట్టారు. అధికసంఖ్యలో రామభక్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంత జీవనం

ఎచ్చెర్ల క్యాంపస్:

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంత జీవనం సాధ్యమని ప్రవచనకర్త పైడి వేణుస్వామి అన్నారు. ఫరీదుపేట అభయాంజనేయస్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం అళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో తిరుప్పావై ప్రవచనాలు కొనసాగుతున్నాయి. భోగీ వరకు ధనుర్మాస వ్రతంలో కొనసాగుతున్న ఈ ప్రత్యేక కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. నీతి, నియమాలతో ధనుర్మాస వ్రతం ఆచరించాలన్నారు. దేవుడి అనుగ్రహం, మోక్షమార్గానికి ఆధ్యాత్మికత మార్గం చూపుతుందన్నారు.


తిరుప్పావై ప్రవచనాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆకట్టుకున్న 'తెరవే' సాహితీ సమ్మేళనం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో తెలుగు రయిచతల వేదిక (తెరవే) ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 88వ నెలవారీ సాహితీ సమ్మేళనం ఆకట్టుకుంది. సంస్థ అధ్యక్షులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి ఆర్.వి.రమణమూర్తి ఆధ్వర్యంలో 14 మంది కవులు సామాజిక పరమైన వివిధ కవితలు చదివారు. కవులు బి.కోమలరావు, ముట్నూరు ఉపేంద్రశర్మ, నిక్కు అప్పన్న, నిక్కు హరిసత్యన్నారాయణ, గుడిమెట్ల గోపాలకృష్ణ, తులాల సవరమ్మ, ఐ.ఎస్.డి.ప్రసాద్, పి.వి.దుర్గాప్రసాద్, సీహెచ్. శ్రీనివాసరావు, లలితారెడ్డి, తంగి ఎర్రమ్మ, ఎస్.ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న దళిత మహాసభ సభ్యులు

రణస్థలం: ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ జిల్లా మహిళా కార్యదర్శి కుప్పిలి సత్యవతి భర్త శ్రీనివాసరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబానికి ఏపీ దళత మహాసభ సభ్యులు ఆదివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రాము ఆధ్వర్యంలో రూ.8 వేల ఆర్థికసాయం అందజేశారు. దళిత మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు డి.కుసుమ, ఎచ్చెర్ల, రణస్థలం మండల శాఖల గౌరవ అధ్యక్షులు నీడిగంట్ల సూర్యారావు, జి.సింహాద్రి, అధ్యక్షులు కె.కుమార్, రాజయ్య, అప్పారావు, రాము, సెక్రటరీ ముక్కు చిన్న పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ


పింఛన్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పాత శ్రీకాకుళం 28వ వార్డు, సీబీ రోడ్డు పరిధిలోని లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన వృద్ధాప్య పింఛన్ల పంపిణీ కార్యక్రమం పెద్దమ్మ తల్లి ఆలయం అవరణ సమీపంలో వార్డు ఇన్ చార్జి గుంటముక్కల పాపారావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డి.పి.దేవ్, వైఎస్సార్ సీపీ నాయకుడ శిమ్మ రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ డివిజన్‌లో 233 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. సచివాలయం అడ్మిన్ ఐశ్వర్య ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. కార్యక్రమంలో చిట్టిబాబు, ప్రేమ్, కిరణ్, నవీన్, పార్వతీ, శైలజ, వలంటీర్లు ఉన్నారు.

నేడు పలు ప్రభుత్వ భవనాలు ప్రారంభం

జి.సిగడాం: మండలంలోని పలు గ్రామాల్లో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సోమవారం పర్యటిస్తారని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు సేతుభీమవరం గ్రామ సచివాలయం భవనం ప్రారంభం, 11 గంటలకు పున్నాం పంచాయతీలో హెల్త్ క్లినిక్ ప్రారంభం, 12 గంటలకు మెట్టవలసలో గ్రామ సచివాలయం భవనం ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పేదల సొంతింటి కల సాకారం

- మంత్రి ధర్మాన ప్రసాదరావు


పట్టాలను అందజేస్తున్న మంత్రి ధర్మాన

శ్రీకాకుళం రూరల్: సింగుపురం గ్రామానికి చెందిన 50 మందికి మంత్రి ధర్మాన ప్రసాదరావు పెదపాడులోని తన క్యాంప్ కార్యాలయంలో ఇంటి పట్టాలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సొంత ఇంటి కలను సాకారం చేసిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టడమే కాకుండా మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధికే పెద్దపీట వేశామన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, సింగుపురం సర్పంచ్ గుండ ఆదిత్యానాయుడు, ఎంపీటీసీ సభ్యుడు నక్క శంకర్, పార్టీ నాయకులు పొన్నాన కూర్మారావు, నక్క భారతమ్మ, తహసీల్దార్ ఎస్.వెంకట్రావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సేవకు ప్రతిరూపం వివేకానందుడు


వివేకానందునికి నివాళులర్పిస్తున్న క్లబ్ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: సేవకు, త్యాగాలకు ప్రతిరూపంగా వివేకానందుడు నిలుస్తారని లయన్స్ క్లబ్ సెంట్రల్ అధ్యక్షుడు నటుకుల మోహన్ అన్నారు. శారదా రామకృష్ణ సేవా సమితి సారధ్యంలో నిర్వహిస్తున్న జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా రెండవ రోజు కార్యక్రమం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ముందుగా వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ డాక్టర్ బాడాన దేవభూషణరావు, ఉత్సవ కన్వీనర్ మంద పల్లి రామకృష్ణ, రాజు, ఉమాకవి, మురళీమోహన్, చిరంజీవి ఉన్నారు.

తెరుచుకున్న అంగన్‌వాడీ కేంద్రాలు


మంగువారితోట కేంద్రంలో సరుకులు అందుకుంటున్న దృశ్యం


హడ్కో కాలనీలో సరుకులు తీసుకుంటూ..

శ్రీకాకుళం క్రైమ్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడంతో నగరపాలక సంస్థ పరిధిలో ఆదివారం పలు చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు తెరుచుకున్నాయని శ్రీకాకుళం నగర ఐసీడీఎస్ పీవో శోభారాణి తెలిపారు. కేంద్రాలు తెరుచుకోవడంతో టీహెచ్‌ఆర్ కింద సరుకులు (గుడ్లు, పాలు, బియ్యం, బాలామృతం, కందిపప్పు, ఆయిల్) అందుకోవడానికి గర్భిణులు, బాలింతలు కేంద్రాలకు వచ్చారు.

చిన్నారులకు పోటీలు


బహుమతులతో విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు నీతి కథల పోటీలు జరిగాయి. 20 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు సంస్థ వ్యవస్థాపకులు ఎల్.నందికేశ్వరరావు, అతిథుల చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. క్లబ్ నిర్వాహకులు నిక్కు హరిసత్యన్నారాయణ, బి.ఎం.ఎస్.పట్నాయిక్, ప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన ఇస్కాన్ ఉత్సవం


హరి సంకీర్తనలు గానం చేస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: ఇస్కాన్ జగన్నాథ మందిరంలో మూడురోజులు జరుగుతున్న ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అరసవల్లి ఆర్చి నుంచి ఇస్కాన్ సభ్యులు మహానగర హరి నామ సంకీర్తన చేశారు. పాతబస్టాండు మీదుగా జిల్లాపరిషత్ రోడ్డు నుంచి పొన్నాడ వంతెన వద్దగల ఇస్కాన్ మందిరం వరకు సంకీర్తన సాగింది. తిరుపతి ఇస్కాన్ మందిరం నుంచి వచ్చిన వైష్ణవులు, భక్తులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదవాలి


విద్యార్థులతో శిబిచక్రవర్తి, తదితరులు

నరసన్నపేట: విద్యార్థులు పట్టుదలతో చదివితే అనుకున్న లక్ష్యాలు సాధించవచ్చని మేఘాలయ కేడర్ ఐఏఎస్ అధికారి, నరసన్నపేట మండలం జమ్ము జనజాగృతి గౌరవ అధ్యక్షుడు సాదు శిబి చక్రవర్తి అన్నారు. జమ్ము జనజాగృతి సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక గీతాంజలి స్కూల్లో నవోదయ మోడల్ పరీక్షను ఆదివారం నిర్వహించారు. మొదటి పది ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మోమెంటోలను శిబి చక్రవర్తి అందించారు. జమ్ము జనజాగృతి అధ్యక్షుడు, లావేరు తహసీల్దార్ దిలీప్ చక్రవర్తి మాట్లాడుతూ నవోదయ నమూనా పరీక్షకు 250 మంది హాజరయ్యారని తెలిపారు. ప్రతీ సంవత్సరం నమూనా పరీక్ష నిర్వహిస్తూ విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని తొలగిస్తున్నామన్నారు. సొసైటీ సభ్యులు మామిడి అప్పన్న, బి.ధనుంజయదేవ్, టెంక శ్రీను, చల్ల అప్పన్న, ఎ.శ్రీను, గీతాంజలి స్కూల్ కరస్పాండెంట్ ఆర్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెండు వేల మందికి వస్త్రదానం


వస్త్రదానం చేస్తున్న డాక్టర్ శ్రీధర్

కవిటి: శ్రీకాకుళం కేంద్రంగా పనిచేస్తున్న దానేటి శ్రీధర్ చారిటబుల్ ట్రస్టు అందజేస్తున్న సేవలు నిరుపమానమైనవని వక్తలు కొనియాడారు. రాజపురంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో రెండు వేల మంది వృద్ధులు, వితంతువులు, పేదలకు దుప్పట్లు, చీరల్ని పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు దానేటి శ్రీధర్ వీటిని పేదలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజపురం పరిసర ప్రాంతాలకు చెందిన పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు సర్టిఫికెట్ కోర్సు చేసేందుకు ఆసక్తి ఉంటే తమను నేరుగా సంప్రదించాలన్నారు. వారందరికీ తానే ఫీజుకట్టి కోర్సు పూర్తి చేయించి ఉద్యోగకల్పన బాధ్యత తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీఎస్పీ ఎస్‌వీవీ ప్రసాదరావు, స్థానిక సర్పంచ్ సనపల జానకీరావు, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణారావు, పీఏసీఎస్ డైరెక్టర్ ఎన్ని అశోక్, కరాపాడు సర్పంచ్ మురపాల లచ్చయ్య ఉన్నారు.